PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 95 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 02 ఏప్రిల్ 2026

### వేసవి కాలంలో త్రాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలి




### KDCలో గృహ ఉపయోగకర రసాయన పదార్థాల తయారీపై వర్క్‌షాప్..






## ఈ వేసవిలో మండుటెండలు
# ఖాయం

**మూడు నెలలు ఎండలు, వడగాలులు తప్పవు**

**భారత వాతావరణశాఖ హెచ్చరిక**

**హైదరాబాద్,ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో ఈ వేసవి సీజన్ మొత్తం ఎండ మంట పుట్టించనుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని వాతావరణ వాఖ హెచ్చరించింది. రానున్న మూడు నెలలకు దేశంలో వాతావరణ పరిస్థితులు, ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బులెటిన్ విడుదల చేసింది. వచ్చే మూడు నెలలు రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారే అవకాశం ఉంది. ఏపీతోపాటు ఒడిశా, తెలంగాణలో కొంత భాగం, పశ్చిమ బెంగాల్, బిహార్, యూపీ, ఈశాన్య రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదుకానున్నాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదవుతాయి. ఈ మూడు నెలల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు

మిగతా2లో...

# నేటి నుంచి భూభారతి అమలు

**● ఐదు మండలాల్లో ప్రయోగాత్మకం ● అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్,ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో భూ వివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది . ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి,నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి అమలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పోర్టల్ ప్రారంభంపై బుధవారం అధికారులతో మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి రివ్యూ నిర్వహించారు. భూభారతితో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి, రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను మిగతా2లో...

## కాంగ్రెస్ ప్రిన్స్‌కు వందోసారి కూడా ఓటమి ఖాయం: మోదీ



**గువాహటి,01 (పిసిడబ్ల్యూ న్యూస్):** అస్సాం గత పదేళ్లుగా గణనీయమైన అభివృద్ధిని సాధించిందని, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేను మరోసారి రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారనే నమ్మకం తనకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గోగముఖ్‌లో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మాట్లాడుతూ, ప్రజల ఉత్సాహాన్ని చూస్తుంటే అభివృద్ధి, సుస్థిరతకే పట్టంకట్టనున్నట్టు చాలా స్పష్టంగా కనిపిస్తోందన్నారు.'ఈసారి ఎన్నికలు వికసిత్ భారత్ నిర్మాణానికి జరుగుతున్న ఎన్నికలు. మిగతా2లో...

## ఆరు గ్యారెంటీలపై నిలదీయండి

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామచందర్‌రావు**




## కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు




## నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర


**- 3వేల మందితో పోలీస్ బందోబస్తు**




## కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

**- ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం**

**- వేలాది మంది ఉద్యోగులకు లబ్ది చేకూరే అవకాశం**




## రేషన్ కార్డుల తొలగింపు
# దుర్మార్గపు చర్య

**5లక్షలు ఇచ్చామని చెప్పి 15లక్షలు తొలగించే కుట్ర**

**ప్రభుత్వ తీఈరుపై మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత**



**హైదరాబాద్,ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో పేదలను రేవంత్ రెడ్డి సర్కార్ వేధిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేషన్ కార్డుల ఏరివేత అనే దుర్మార్గపు చర్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత సీరియస్ అయ్యారు. పేదలకు అన్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకుంటూ.. మరోవైపు 15 లక్షల కార్డులు తొలగించే ప్రయత్నం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో కార్డులు తీసేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపయోగపడే రేషన్ కార్డుల విషయంలో ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవుపలికారు. కొండగట్టు చలువ పందిళ్ల ప్రమాదంపైనా కవిత స్పందించారు. పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడడంపై విచారం మిగతా2లో...

# అడుగంటుతున్న జూరాల ప్రాజెక్ట్

**ఆందోళనలో ఆయకట్టు రైతాంగం**

**కర్నాకటతో మాట్లాడనున్న మంత్రి ఉత్తమ్**



**మహబూబ్‌నగర్,ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణా ధారమైన జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో పాలమూరు రైతాంగం ఆందోళన చెందుతోంది. దీంతో సాగునీటితో పాటు, తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు పడిపోవడంతో కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందడం లేదు. దీని ప్రభావం కోయిల్ సాగర్ చివరి ఆయకట్టుపై తీవ్రంగా పడుతోం ది, సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కోయిల్ సాగర్ ఆయకట్టును ఆదుకోవడానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని , సంబంధిత మంత్రిని కోరారు.మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న ఈ సాగునీటి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో ఫోన్ లో మాట్లాడి, జూరాలకు కనీసం 5 టీఎంసీల నీటిని తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కేవలం ఫోన్ సంప్రదింపులకే పరిమితం కాకుండా, ఈ సమస్య పరిష్కారం కోసం పాలమూరు జిల్లాకు చెందిన మంత్రులు , ఎమ్మెల్యేల బృందం మరో వారం రోజుల్లో బెంగళూ రు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నేరుగా కలవాలని నిర్ణయించుకుంది. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నీటిని విడుదల చేస్తేనే ఎండిపోతున్న పంటలకు ప్రాణం పోసే అవకాశం ఉంటుంది.



## రెండు పంచాయితీలకు వికాస్ పురస్కారాలు

**- హర్షం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క**

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామీణాభివఅద్ధి, సుస్థిర పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరిచిన తెలంగాణ పంచాయతీలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు లభి ంచింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ మిగతా2లో...

## జిఎస్టీ వసూళ్లలో 8.8శాతం వృద్ధి

**- మార్చిలో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు**



# ఈ వేసవిలో మండుటెండలు ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

వీయనున్నాయి. ఏప్రిల్‌లో సగటున మూడు, నాలుగు రోజులు, మే, జూన్ నెలల్లో పది, అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉండనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. ఏప్రిల్‌లో రాష్ట్రంలోని గోదావరి జిల్లాలు తప్ప మిగిలిన ప్రాంతాల్లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఇక ఏప్రిల్‌లో ఈశాన్య రాష్ట్రాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. మార్చిలో సాధారణ వర్షపాతం 29.9 మిల్లీమీటర్లకుగాను 33.7 మిల్లీమీటర్లు నమోదైంది. 1901 నుంచి ఇప్పటి వరకు మార్చిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోద వడం ఇది 32వ సారి. పసిఫిక్ మహాసముద్రంలో లానినా చివరిదశకు చేరుకుంది.

కొద్దిరోజుల్లో తటస్థ పరిస్థితులకు చేరుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ మోడల్స్ వెల్లడిస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని, జూన్(నైరుతి రుతుపవనాల ప్రారంభం) నుంచే ఎల్‌నినో మొదలవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

# కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

**హైదరాబాద్,ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ÷నాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే పక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.

# రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. హనుమాన్ చిన్న జయంతి వేడుకల కోసం నాసిరకం పందిళ్లు వేయడంతోనే ప్రమాదం జరిగిందని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఉత్సవాల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. గాయపడిన భక్తులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# మంత్రి పొంగులేటి అక్రమాలపై హౌజ్ కమిటీ కోరాం

**సిఐడి విచారణ జరిగితే తేలేదేమీ ఉండదు**

**కడియం ఏ పార్టీలో ఉన్నాడో తెలపాలన్నాం**

**ఇవన్నీ అడిగితే కేసులతో వేధింపులా**

**మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



**హైదరాబాద్,ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో జరిగే మైనింగ్ స్కామ్‌ను హరీశ్‌రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా బయటపెట్టారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. మైనింగ్ స్కామ్ మీద హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశామని పేర్కొన్నారు. హౌస్ కమిటీ వేయడానికి సీఎం రేవంత్ రెడ్డికి ఏం సమస్య అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. దీనిపై సీఐడీ ఎంక్వైరీ వేస్తామని ప్రభుత్వం చెబుతోందని.. మంత్రి మీద సీఐడీ ఎంక్వైరీ వేస్తే న్యాయం ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. మంత్రిని సీఐడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంటుందా అని పాడి కౌశిక్ రెడ్డి అడిగారు. అందుకే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. అయితే దానం నాగేందర్; కడియం శ్రీహరితో ముఖ్యమంత్రి మాట్లాడించారని చెప్పారు. దానం నాగేందర్ నోటికొచ్చినట్లు మాట్లాడి బెదిరించారని తెలిపారు. అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. కడియం శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. సిట్టింగ్‌ను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకే నువ్వు ఏ పార్టీలో ఉన్నావని కడియం శ్రీహరిని అడిగామని తెలిపారు. తనతోపాటు బీఆర్ఎస్ సభ్యులందరూ అడిగారని,ఇది తప్పా అని నిలదీశారు. కాంగ్రెస్ వాళ్ల దగ్గర ఎందుకు కూర్చున్నావని ప్రశ్నించాం.. అది తప్పా అని ప్రశ్నించారు. నువ్వు ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నావని కడియం శ్రీహరిని అడిగామన్నారు. కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అందరూ నన్ను టా÷-గ్గ÷ట్ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినందుకు తనను టార్గెట్ చేశారని అన్నారు. నిరుద్యోగుల పక్షాన ఉద్యోగాలు అడిగినందుకు టార్గెట్ చేస్తున్నావా అని ప్రశ్నించారు. పెన్షన్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నిస్తే టార్గెట్ చేస్తున్నావా అని నిలదీశారు. ప్రజల కోసం పోరాడుతున్నందుకే తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎథిక్స్ కమిటీకి కాంగ్రెస్ నేతల తిట్లు కనిపించవా అని ప్రశ్నించారు. దానం తిట్లు ఎథిక్స్ కమిటీకి రావా అని అడిగారు. అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు మాట్లాడిన బూతులు అందరూ చూశారని తెలిపారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌లో ఉంటే కేసీఆర్, హరీశ్‌రావును ఎందుకు విమర్శించారని ప్రశ్నించారు. హామీలపై మేం ప్రశ్నిస్తే మమ్మల్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతిని బయటపెడితే ప్రభుత్వం స్పందించడం లేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మండిపడ్డారు. మైనింగ్‌పై జరుగుతున్న అవినీతిపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. సభాసంఘం వేయాలని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. నిజమైన నాయకులంటే పార్టీ లైన్‌లో ఉండాలి.. కానీ పార్టీ మారిన మనిషిని మీ భుజాల మీద ఎత్తుకుంటున్నారని మండిపడ్డారు.. తోటి శాసనసభ్యుడిని తిట్టేందుకు మంత్రులకు మైక్‌లు ఇచ్చారని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు ఒక్కరైనా సబ్జెక్ట్ మాట్లాడారా అని ప్రశ్నించారు. స్వర్ణకారుల కష్టాల గురించి ఒక్కరైనా మాట్లాడారా అని అడిగారు. అవినీతి మంత్రిని, పార్టీ మారిన వ్యక్తిని వెనుకేసుకొచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయితే మా వెనుకాల కూర్చోవాలి కదా అని ప్రశ్నించారు. కడియం శ్రీహరి వంటి నాయకుడి మీరు వెనుకేసుకొస్తారా అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి ఏ పార్టీ అని మేం తప్పకుండా అడుగుతామని తెలిపారు. తొలిసారి అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యేలు రాజ్యాంగ విలువలు కాపాడాలని సూచించారు. అసెంబ్లీలో చర్చ చూసి పిల్లలు నవ్వుకుంటున్నారని అన్నారు. సభలో పాలసీల గురించి మాట్లాడుతున్నామా? అని అడిగారు. మనం చర్చించాల్సింది ప్రజల సమస్యల గురించి మాత్రమే అని స్పష్టం చేశారు.

# రెండు పంచాయితీలకు వికాస్ పురస్కారాలు

(మొదటి పేజీ తరువాయి)

సతత్ వికాస్ పురస్కారాలు' రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలను వరించాయి. వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలానికి చెందిన మోతుకుపల్లి గ్రామ పంచాయతీ 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో జాతీయ అవార్డును దక్కించుకోగా, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగంలో అత్యుత్తమ పురస్కారాన్ని సాధించింది. గ్రామ స్థాయిలో అత్యంత పారదర్శకమైన పరిపాలన అందించడం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడం , మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన అసాధారణ కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీలకు ఈ గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన , మహిళా సాధికారత దిశగా తమ ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్టమైన చర్యలకు ఈ అవార్డులే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది , గ్రామస్థులకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇలాంటి విజయాలు రాష్ట్రంలోని ఇతర పంచాయతీలకు గొప్ప ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు అభివృద్ధి బాటలో నడిచి జాతీయ స్థాయిలో తెలంగాణ కీర్తిని చాటాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

## కొండగట్టు ఆలయంలో అపశృతి

**- చలువ పందిళ్లు కూలి 15మందికి గాయాలు**

**జగిత్యాల,ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజన్న ఆలయంలో అపశ్రుతి నెలకొంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హనుమాన్ మాల విరమణ కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు కూడా వేశారు. ఈ క్రమంలో నాసిరకంగా వేయడంతో చలువ పందిరి కూలిపోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు.

## కాంగ్రెస్ ప్రిన్స్‌కు వందోసారి కూడా ఓటమి ఖాయం: మోదీ

(మొదటి పేజీ తరువాయి)

అస్సాంలో బీజేపీ హ్యాట్రిక్ విజయంతో తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని ప్రధాని అన్నారు. కాంగ్రెస్‌కి హ్యాట్రిక్ పరాజయం, ఆ పార్టీ యువరాజు రాహుల్‌కు వందోసారి ఓటమి ఖాయమని చెప్పారు. మూడోసారి ప్రధానిగా తాను హ్యాట్రిక్ సాధించానని, అస్సాంలో బీజేపీని కూడా హ్యాట్రిక్ విజయంతో ప్రజలు ఆశీర్వదిస్తారనే గట్టి నమ్మకంతో ఉన్నానని పేర్కొన్నారు.

బీజేపీ ఎన్నికల మేనిపె, స్టోను మోదీ ప్రస్తావిస్తూ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనతో అస్సాంలోని 15 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతాయని, ఇంతవరకూ ఇళ్లు రాని ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఇచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. పేద కుటుంబాలను కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య కల్పిస్తామన్నారు. ఆదివాసీల హక్కులను కాపాడాతామని, ఉమ్మడి పౌర స్మృతి అమలు చేస్తామని పేర్కొన్నారు. 126 మంది సభ్యుల అస్సాం అసెంబ్లీకి ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికలు జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ:ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు ఢిల్లీ హైకోర్టు బుధవారంనాడు నోటీసులు పంపింది. ఎక్సైజ్ పాలసీ కేసులో సమన్లు జారీ చేసినప్పటికీ కేజ్రీవాల్ హాజరుకాలేదంటూ ఈడీ నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో ఆయనను రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల నిర్దోషిగా ప్రకటించింది. దీనిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ హైకోర్టులో సవాలు చేసింది.విచారణ చేపట్టిన హైకోర్టు కేజ్రీవాల్‌కు తాజాగా నోటీసులు పంపింది. తదుపరి విచారణను ఏప్రిల్ 29వ తేదీకి వాయిదా వేసింది.ఈడీ పిటిషన్‌పై జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కేజ్రీవాల్‌కు ముందుగానే నోటీసులు ఇచ్చినప్పటికీ ఆయన ఉద్దేశపూర్వకంగానే విచారణకు హాజరుకాలేదని ఈడీ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. కేజ్రీవాల్‌ను నిర్దోషిగా ప్రకటించి ట్రయల్ కోర్టు తప్పిందం చేసిందన్నారు. ఈడీ వాదనలు విన్న ధర్మాసనం కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ ఈనెల 29వ తేదీకి కేసును వాయిదా వేసింది.దీనికిముందు, మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌పై విచారణకు తగిన ఆధారాలు లేవంటూ ఫిబ్రవరి 27న విచారణ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. కేజ్రీ వాల్‌తో పాటు సిసోడియా, మరో 21 మందిని లిక్కర్ పాలసీ కేసులో నిర్దోషులుగా ప్రకటించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ కూడా ప్రస్తుతం హైకోర్టు విచారణలో ఉంది.

## జిఎస్టీ వసూళ్లలో 8.8 శాతం వృద్ధి

**హైదరాబాద్,ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలో జిఎస్టీ వసూళ్లు నెలనెలా భారీగా వసూలు అవుతున్నాయి. దీంతో కేంద్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు భారీగా నమోదయ్యాయి. మార్చి నెలకు గానూ 8.8 శాతం వృద్ధితో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈస్థాయిలో పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. గతేడాది మార్చిలో జీఎస్టీ వసూళ్లు రూ.1.83 లక్షలుగా నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 5.8 శాతం వృద్ధితో రూ.1.46 లక్షల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 17.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. రిఫండ్ల సర్దుబాటు అనంతరం నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.78 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి 8.3 శాతం వృద్ధితో జీఎస్టీ వసూళ్లు రూ.22.27 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది.

## నేటి నుంచి భూభారతి అమలు

(మొదటి పేజీ తరువాయి)

కూడా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతీ సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలోనే భూధార్ నంబర్‌ను కేటాయించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే నక్ష లేని ఐదు గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి, భూధార్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఒక్క క్లిక్‌తో రైతుల భూములకు సంబంధించిన పూర్తి సమాచారం లభించేలా పోర్టల్‌ను రూపొందించామని, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి వివరాలు పొందవచ్చని చెప్పారు. ధరణిలో 36 మాడ్యూల్స్ ఉండగా.. వాటి గందరగోళానికి చెక్?పెడుతూ భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు.

## ఆరు గ్యారెంటీలపై నిలదీయండి: రామ్

**హైదరాబాద్,ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో 6 గ్యారంటీల అమలులో అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిపై నిరసన తెలుపుతూ నిలదీయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామచందర్‌రావు పార్టీ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముందుగా 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లయినా ఇంతవరకు అమలు చేయకుండా మోసం చేస్తుందని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వేలో బూత్ స్థాయి కార్యకర్తలు బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికి వెళ్లి బోగస్ ఓటర్లను ఏరి వేయడంలో సహకరించాలన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు రాబోయే రోజుల్లో ఎప్పుడైనా వచ్చే అవకాశమున్నందున పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర



**హైదరాబాద్,ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలో హనుమత్ జయంతికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇకపోతే గురువారం హనుమత్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. ఏప్రిల్ 2న హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించాక పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా సుమారు 3వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్ అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల శోభాయాత్ర మార్గాన్ని వాహనంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్లపై చెత్తాచెదారం, మట్టికుప్పలు, రాళ్లు లేకుండా, రోడ్డుపైకి వచ్చే చెట్టుకొమ్మలు తొలగించే పనులు చేస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా యాత్ర జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# KDCలో గృహ ఉపయోగకర రసాయన పదార్థాల తయారీపై వర్క్‌షాప్..





**హనుమకొండ : ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ ప్రభుత్వ కళాశాల (అటానమస్), హనుమకొండలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గృహ ఉపయోగకర రసాయన పదార్థాల తయారీపై బుధవారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు చెందిన సేవా భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సేవా భారతి సంస్థకు చెందిన పి. జయంతి రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని వాషింగ్ పౌడర్, ఫినాయిల్, లిక్విడ్ సోప్, ఫ్లోర్ క్లీనర్, పెయిన్ బామ్ తయారీపై ప్రాయోగిక శిక్షణ అందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉపాధి నైపుణ్యాలను పెంపొందించి, చదువుతున్నప్పుడే సంపాదించుకునే అవకాశాలను కల్పిస్తాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రసాయన శాస్త్ర విభాగపతి ప్రొఫెసర్ వాసం శ్రీనివాస్ కన్వీనర్‌గా, డాక్టర్ ఎం. విజయలక్ష్మి ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రెండు భాగాలుగా నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో పూర్తి స్థాయి ప్రదర్శనలతో తయారీ విధానాలను వివరించారు. కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రత్యక్ష అనుభవాన్ని పొందారు. విద్యార్థులు ఈ పదార్థాలను స్వయంగా తయారు చేసి స్వయం ఉపాధి పొందుతామని ముగింపు సభలో తెలిపారు. అలాగే, తయారీకి అవసరమైన ముడి సరుకులు అందించే సంస్థల వివరాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్. రజనీలత, IQAC కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీనాథ్, కెమిస్ట్రీ విభాగ అధ్యాపకులు ఎడమ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ బి. సంధ్యారాణి, డాక్టర్ డి. వీరన్న, బి. రమేష్, ఇతర విభాగాధిపతులు డాక్టర్ కోమల, డాక్టర్ దినేష్, డాక్టర్ పి. పల్లవి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చే సన్న బియ్యం పథకం.. పరకాలలో ఘనంగా పంపిణీ





**పరకాల, ఏప్రిల్ 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణ కేంద్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదల ఆకలి తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా మారిందని స్థానిక కౌన్సిలర్లు పేర్కొన్నారు. ప్రతి పేదవాడికి కడుపునిండా అన్నం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. ఈ నెలతో పాటు మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడం ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి లకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపాలిటీ కౌన్సిలర్లు కొయ్యడ శ్రీనివాస్, బండి శ్రీధర్, సుధమల్ల రమేష్, ఆయిల్పెల్లి స్వామి, బండి రాజేందర్, డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఇలాంటి పథకాలు కొనసాగాలని స్థానిక ప్రజలు ఆకాంక్షించారు.

# వేసవి కాలంలో త్రాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలి


## యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

## జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చూడాలి: మంత్రి సీతక్క



**ములుగు జిల్లా,ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** వేసవి కాలం లో త్రాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, యుద్ధ ప్రతిపాదికన ఇందిరమ్మ నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చూడాలని, జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి త్రాగు, సాగు నీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై జిల్లా ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవి కాలంలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, గుత్తికోయ ప్రాంతాలలో ప్రత్యేక ప్రణాళికల చేతి పంపు, ట్రాక్టర్ ట్యాంక్ ద్వారా త్రాగునీరు సరఫరా చేయాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. యుద్ధ ప్రతిపాదికన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేలా అధికారులు చూడాలని లబ్ధిదారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకొని నిర్మాణాలలో వేగం పెంచేలా చూడాలని, మంజూరు అయిన ఇండ్ల లబ్ధిదారులు ఇప్పటివరకు గ్రౌండింగ్ చేయకపోతే దానికి గల కారణాలు సేకరించి లబ్ధిదారులు మహిళ సంఘం లో ఉంటే వారికి వెంటనే లక్ష రూపాయల రుణం అదే విధంగా చూడాలని అన్నారు. జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని ఉద్దేశంతో మొట్టమొదటిసారిగా 200 కోట్ల రూపాయల నిధులతో గోదావరి జలాలను జిల్లాకు మళ్లించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, గ్రామ పంచాయితీలకు మంజూరు చేసిన నిధులను నియమ నిబంధనల ప్రకారం మాత్రమే ఉపయోగించుకోవాలని ఎట్టి పరిస్థితుల్లో ప్రజాధనాన్ని వృధా కాకుండా చూసుకోవాలని సూచించారు. చిన్న అభివృద్ధి పనుల ద్వారా ప్రజలకు పెద్ద మొత్తంలో ప్రయోజనాలు చేకూరుతాయని, జిల్లా అభివృద్ధి కోసం మెరుగైన ప్రణాళికలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్డీవో వెంకటేష్, ఆర్ డబ్ల్యూ ఎస్ సి ఈ సురేష్, ఈ ఈ మాణిక్య రావు, ఇరిగేషన్ ఈ ఈ నారాయణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**మొగుళ్ళపల్లి,ఏప్రిల్ 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** తమతోపాటు కలిసి చదువుతున్న మిత్రునికి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని రంగాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ౨ా.౨ా.జ.2005వ సంవత్సరంలో పదవ తరగతి బ్యాచ్ కి చెందిన మ్యాదరి రాజేందర్ తండ్రి మ్యాదరి దేవయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. దీంతో మ్యాదరి రాజేందర్ తో కలిసి చదువుకున్న స్నేహితులు తమ మిత్రుడికి15 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. తమతో చదువుకున్న మిత్రుడి తండ్రి మృతి చెందడంతో ఆర్థిక సాయం అందించి తోడుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో వైనాల మహేందర్, బాల్త రాజు, అచ్చ మహేందర్, పల్లెబోయినసురేష్, మంగళంపల్లి రమేష్, పావుశెట్టి అశోక్, కోడి మాల శ్రీనివాస్, రత్న చిరంజీవి, దండ్రే రమేష్, అచ్చ రాజయ్య తదితరులు పాల్గొన్నారు

# మాదాపూర్‌లో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే...



**గన్నేరువరం,ఏప్రిల్01(పీసీడబ్ల్యూ న్యూస్):** రైతులు పండించిన మొక్క జొన్నలకు మద్దతు ధర కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని సత్యనారాయణ అన్నారు. బుధవారం గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులకు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మధ్యవర్తుల సమస్య లేకుండా రైతులు నేరుగా కేంద్రాలకు పంటను తీసుకువచ్చి అమ్ముకోవాలని ఆయన సూచించారు.రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి రైతుకు అండగా నిలుస్తూ వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కృషి చేస్తున్నదని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ పులి కృష్ణ,పార్టీ నాయకులు చింతల శ్రీధర్ రెడ్డి, మాతంగి అనిల్, బుర్ర మల్లేష్ గౌడ్, మల్లికార్జున్, వేణు, వెంకట్ రెడ్డి, తిరుపతి, అంజిరెడ్డి, కటకం తిరుపతి, జిల్ల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులకు ఆసరాగా ప్రణామ్ డే కేర్ సెంటర్: మంత్రి సీతక్క




**ములుగు జిల్లా,ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రణామ్ డే కేర్ సెంటర్ వయవృద్ధులకు ఆసరాగా నిలుస్తాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనములో ఏర్పాటుచేసిన ప్రణామ్ వయవృద్ధుల డే కేర్ సెంటర్ ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ డే కేర్ సెంటర్ లో వయోవృద్ధులు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు అహ్లాదకరమైన వాతావరణం కల్పించడం జరుగుతుందని, మానసిక ఉల్లాసానికి ఆటలు, రాగి జావా టి అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమం కొరకు కొత్త చట్టం రూపొందించడం జరిగినదని ఎవరైనా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు వారి యొక్క తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టప్రకారం వారి జీతంలో 10 % నుండి 15 % వరకు కోత విధించడం జరుగుతుందని స్పష్టం చేశారు. వయోవృద్ధుల సంక్షేమం పిల్లల యొక్క బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయవృద్ధుల పట్ల వారి పిల్లలు నిర్లక్ష్యం వహించకూడదని అన్నారు. డే కేర్ సెంటర్ ల వయోవృద్ధులకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మానసిక ఉల్లాస కార్యక్రమాలు, యోగ , మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహిం చడం జరుగుతుందని, డే కేర్ సెంటర్ ను వయవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, బి డబ్ల్యు ఓ ప్రేమలత, కౌన్సిలర్లు, రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వయోవృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుదారులకు గుడ్ న్యూస్.. 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ

## ములుగు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సైని

**ములుగు జిల్లా,ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** రేషన్ కార్డు లబ్ధిదారుల విషయంలో రాబోయే వేసవి కాలం దృష్ట్యా ఒకేసారి మూడు నెలల సరిపడా రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్, మే, జూన్ ఈ మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఏప్రిల్ నెలలోనే పంపిణీ జరిగేలా చూడాలని , మార్చి మొదటి వారంలోనే ఎండలు మండిపోతున్నాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే ఎండలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రంలోనే రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ములుగు జిల్లాలో దాదాపు 1 లక్ష 2 వేలకి పైగా కార్డులు ఉన్నాయి. ఒకేసారి మూడు నెలలకు సరిపడ కోటా 5,490మీం బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినదని,తగు ఏర్పాట్లు చేసినామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సైని తెలియపరిచినారు. ఒకేసారి మూడు నెలలకు సంబంధించి ఒక్కో కార్డుదారుడు 3 సార్లు వేలి ముద్ర (థంబ్) వేయాల్సి ఉందని, దీనికి తోడు సర్వర్ సమస్యలు రాకుండా తగు చర్య లు తీసుకుంటున్నామనిజిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తెలియపరిచినారు.



# నిరుపేదల సంజీవనీ... 108 అంబులెన్స్

**• ఎమర్జెన్సీ టెక్నీషియన్. శిలపాక రాజు**





**చిట్యాల ఏప్రిల్ 1 (పీసీడబ్ల్యూ న్యూస్):** 108 అంబులెన్స్ సేవలు ఆపద్బాం ధవులుగా నిలుస్తూ వేలాది మంది ప్రాణాలను కాపాడుతున్నాయి 108 కి ఫోన్ కాల్ రాగానే 30 సెకండ్లలో పైలెట్ అంబులెన్ను స్టార్ట్ చేస్తూ సమయస్ఫూర్తితో ప్రమాదము జరిగిన సంఘటన స్థలానికి తీసుకెళ్తున్నారు అదే క్రమంలో రోగిని అంబులెన్స్ లోకి తీసుకొని అతని యొక్క ఆరోగ్య పరిస్థితిని ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ తగిన ప్రాథమిక చికిత్స చేస్తూ సంఘటనా స్థలం నుండి దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు అలాగే కొన్ని సందర్భాలలో 108 లో విధులు నిర్వహిస్తున్న క్రమంలో తింటున్న అన్నం కూడా వదిలేసి108 కి కాల్ వచ్చిన వెంటనే. రోగి యొక్క ప్రాణమే ధ్యేయంగా తరలి వెళ్తున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి అదేవిధంగా పగలు రాత్రులు అనే భేదం లేకుండా వారి యొక్క ప్రాణాలను పణంగా పెట్టి సమాజంలో జరిగేటువంటి రోడ్డు ప్రమాదాలను మరియు గర్భిణీ స్త్రీలను పాయిజన్ కేసులో గుండెపోటు సంబంధించిన అనేక కేసులను సమయపూర్తితో చికిత్స అందిస్తున్నామని అంబులెన్స్ ఎమర్జెన్సీ టెక్నీషియన్. శిల్పక రాజు అన్నారు.

## మృత్యువు అంచుల నుంచి ప్రాణాలు కాపాడిన వైద్యుడు డాక్టర్ పేర్ల హర్షతేజ్ సేవలకు ప్రశంసలు



**ఖమ్మం, ప్రతినిధి ఏప్రేల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరిన రోగులకు సమయానికి స్పందించి ప్రాణాలను కాపాడుతూ సేవాభావంతో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ పేర్ల హర్షతేజ్ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. ఖమ్మం నగరంలోని స్తంభాద్రి హాస్పిటల్‌లో సేవలందిస్తున్న ఆయన నిబద్ధత, నైపుణ్యం, మానవత్వంతో కూడిన వైద్య సేవల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి చేరే రోగులకు వేగంగా చికిత్స అందిస్తూ, మరణం అంచులనుంచి తిరిగి కొత్త జీవితం ప్రసాదించే వైద్యుడిగా ఆయన పేరు సంపాదించారు. రోగుల ఆరోగ్యం పట్ల చూపే అపారమైన శ్రద్ధ, బాధ్యతాభావం, సేవా దృక్పథం ఆయనను ఇతర వైద్యులకంటే ప్రత్యేకంగా నిలబెడుతోంది. దీంతో ప్రజల్లో ఆయనపై విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోంది. ఇటీవల ప్రాణాలతో కొట్టుమిట్టాడుతూ ఆసుపత్రికి చేరిన యార్లగడ్డ శ్రీ రామమూర్తి ని అత్యవసర వైద్య చికిత్సతో కాపాడిన ఘటన డాక్టర్ హర్షతేజ్ వైద్య నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది. సరైన సమయంలో అందించిన చికిత్సతో మూర్తి గారు ప్రమాదం నుంచి బయటపడి కోలుకున్నారు. ఈ సందర్భంగా భావోద్వేగంతో స్పందించిన మూర్తి "నన్ను కాపాడింది దేవుడు రూపంలో వచ్చిన హర్షతేజ్ డాక్టర్. ఈ రోజు నేను బ్రతికి ఉన్నానంటే అది ఆయన వల్లే" అని కృతజ్ఞతలు తెలిపారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లు ఆమోదించినందుకు ధన్యవాదాలు: కొండ్రోన్ పల్లి గిరిబాబు

**• ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు • ఎన్నో సంవత్సరాల న్యాయవాదుల పోరాటం ఫలించింది**

**హైదరాబాద్ ఏప్రిల్ 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిరంతరం న్యాయవాదులపై దాడులు హత్యలు జరుగుతున్న కోర్టులో కేసులు వేస్తున్న తప్పించుకుని తిరిగే బడా బాబులకు న్యాయవాదుల కు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఎన్నో సంవత్సరాలుగా న్యాయవాదులు పోరాడుతుంటే అసెంబ్లీలో న్యాయవాదుల చట్టం బిల్లును ఆమోదించడం ఎంతో సంతోషమని హైకోర్టు న్యాయవాది కొండ్రోన్ పల్లి గిరిబాబు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో రోజులుగా న్యాయవాదుల పైన విచక్షణ రహితంగా దాడులు జరుగుతున్నాయి, తెలంగాణలో హత్యకు గురైన ప్రముఖ న్యాయవాదులు గట్టు వామన్‌రావు, పి.వి. నాగమణి (2021) మంథని-పెద్దపల్లి హైవేపై పట్టపగలు దారుణ హత్యకు గురయ్యారు. వామన్‌రావు దంపతులు పిఐఎల్‌లు వేయడం వల్ల ఈ హత్య జరిగినట్లు వార్తలు వచ్చాయి, ఈ కేసు దర్యాప్తును సుప్రీంకోర్టు సిబిఐ కి అప్పగించింది. జి. స్వప్న కుమారి (2026) చేవెళ్ల పరిధిలో భూ వివాదం కారణంగా న్యాయవాది స్వప్న కుమారి హత్యకు గురయ్యారు. ఈ ఘటన పై మానవ హక్కుల కమిషన్ డీజీపీని నివేదిక కోరింది. హైదరాబాద్‌లో న్యాయవాది ఇజ్రాయిల్ (2025) ఎల్బీనగర్ సమీపంలో అలాగే అత్తాపూర్ సమీపంలో ఆఫీసులోనే ఒక న్యాయవాది పదునైన ఆయుధాలతో హత్యకు గురయ్యారు. 2026 ఇలా చెప్పుకుంటూ పోతే అనేక న్యాయవాదుల పైన నిరంతరం దాడులు జరుగుతూనే ఉన్నాయి, న్యాయవాదుల రక్షణ చట్టం కోసం ఎన్నో పోరాటాలు చేసాము, ఆ పోరాటాల ఫలితం ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లు అసెంబ్లీలో ఆమోదించడం ఆ బిల్లు గవర్నర్ సంతకం కోసం ఉండడం హర్షనీయం. ఈ సందర్భంగా కొండ్రోన్ పల్లి గిరిబాబు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లు అసెంబ్లీలో ఆమోదించిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ కేటాయించాలని మరియు 2019 ఎన్రోల్మెంట్ చేసుకునే న్యాయవాదులు ఆరోగ్య భద్రత కార్డులు అమలు చేయాలని, న్యాయవాదులకు అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.



## పేదల కోసమే ప్రజా ప్రభుత్వం...

**- ప్రజాభవన్లో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి**





**మానకొండూర్, ఏప్రిల్01 (పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వం పేదల కోసమే పని చేస్తున్నదని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎల్ఎండి కాలనీలోని ప్రజాభవన్ లో తిమ్మాపూర్ మండలానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూకళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద, మధ్య తరగతి వర్గాలకు కొండంత అండగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ పథకాల ద్వారా లక్షా నూటపదహారు రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన కుటుంబాలకు ఈ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. పేద ఆడ పడచులు పెళ్లిళ్లకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్నదని ఆయన వివరించారు. ఈ పథకాలు పేదలకు ఎంతోలాభదాయకంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల తాహసిల్దార్ కర్ర శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బండారి రమేష్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, పొన్నాల సంపత్, గొట్టిముక్కల సంపత్ రెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, పాలు రాము, రమేష్, నరేందర్ రెడ్డి, చింతల తిరుపతి రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు రవీందర్ లక్ష్మారెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఎం జ్యోతి, ఆర్. రమేష్‌జీపీఓ రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు మండలంలో గ్రామసభల సన్నాహక సమావేశం

**ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై అధికారులకు దిశానిర్దేశం**






**కల్లూరు, ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మండలంలో నేడు నిర్వహించనున్న గ్రామసభలను విజయవంతంగా నిర్వహించేందుకు ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం సన్నాహక సమావేశం జరిగింది. ఎంపిడిఓ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. గ్రామసభల్లో చర్చించాల్సిన ముఖ్య అంశాలపై సమగ్రంగా వివరణ ఇవ్వడం జరిగింది. కార్యక్రమం ప్రారంభానికి ముందు జయ జయ హే తెలంగాణ పాటను వినిపించి సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఎంపిడిఓ వివరించారు. ప్రత్యేకంగా రైతు భరోసా, పెన్షన్లు, గృహజ్యోతి, సన్నరకాల రైతులకు బోనస్, రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల గురించి గ్రామసభల్లో స్పష్టంగా వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ పథకాల ప్రయోజనాలను ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామస్థుల సమస్యలను స్వీకరించి, వాటిని గ్రామసభల వేదికగానే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి సమస్యను నమోదు చేసి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా పారదర్శక పరిపాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్ బ్రహ్మేశ్వరరావు, సీడీపీవో నిర్మల జ్యోతి, మండల వ్యవసాయ అధికారి రూప, ప్రత్యేక అధికారులు, ఏఈఓ లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి ఎమ్మెల్యే హాజరు...





**మానకొండూర్, ఏప్రిల్01 (పీసీడబ్ల్యూ న్యూస్):** మానకొండూర్ మండలం పచ్చునూరు గ్రామంలో నేలవేణి జ్యోతి - రవి దంపతులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి బుధవారం మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ మండల పరిషత్ అభివృద్ధి వి.వి రాజేశ్వరి, కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, పార్టీ నాయకులు రొంటాల లక్ష్మారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం: మంత్రి సీతక్క

**• మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు శ్రీకారం....**






**మల్లంపల్లి మండల ప్రతినిధి మార్చి 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క బుధవారం శ్రీకారం చుట్టారు. మల్లంపల్లి గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా అభివృద్ధి చేసి ముందుకు తీసుకెళ్తామని మంత్రి పేర్కొన్నారు. మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.తో కలిసి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామైక్య సంఘ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, సీఆర్ఆర్ నిధులతో రూ.72.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ మల్లంపల్లిని ప్రత్యేక మండలంగా ప్రకటించి ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకుందని తెలిపారు. మండల సముదాయ భవనాలు నిర్మిస్తూ ఎంపీడీఓ, ఎంఆర్ఓ కార్యాలయాలను ఒకే చోట ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలోని అంగడి స్థలాన్ని మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే మల్లంపల్లిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మహిళా సంఘ సభ్యులకు ఇందిరమ్మ జీవిత బీమా పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. అక్షరమాల కార్యక్రమం ద్వారా మహిళలు చదువుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.18 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సీఆర్ఆర్, ఎంఆర్ నిధులతో రోడ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, డీఆర్డీఓ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ సునీత, మండల ప్రత్యేక అధికారి కృపాకర్, సర్పంచ్ శ్యామ్ రావు, ఉప సర్పంచ్ అంకం సురేష్ మరియు వార్డ్ నెంబర్లు, ఎంపీఓ, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నల్లగొండలో 11న జరిగే హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి...

**తిమ్మాపూర్, ఏప్రిల్01 (పీసీడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ మండలం పర్లపల్లి ఉప మండలం నల్లగొండ శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో 11న తలపెట్టిన హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సమ్మేళన సమితి అధ్యక్షులు బోనాల మోహన్, ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. 11న జరిగే కార్యక్రమం కోసం హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలని కోరుతూ నిర్వహణ సమితి బాధ్యులు బుధవారం రోజున ప్రముఖులను కలిసి ఆహ్వానించారు. ఆ దిశలో మొగిలిపాలెం గ్రామ వాస్తవ్యులు డాక్టర్ సముద్రాల శ్రీనివాస్ ను ఆర్థోపెడిక్ సర్జన్ (సిద్దిపేట)ను హిందూ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు.. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు బోనాల మోహన్ ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ , ఉపాధ్యక్షులు ఎర్రోజు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## చిలుకోయలపాడు గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**• ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్ రెడ్డి**

**సీరోల్, ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిలుకోయలపాడు గ్రామంలో గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న ఆధ్వర్యంలో సుమారు మూడు లక్షల యాభై వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు ప్రభుత్వం అండగా నిలవడం ఎంతో ముఖ్యమని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందించిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు, బాధితులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆర్టీసీని బలోపేతం చేస్తూనే మహాలక్ష్మి పథకం అమలు

**ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**

**సత్తుపల్లి డిపోలో మహాలక్ష్మి పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళా ప్రయాణికుల మధ్య సంబరాలు**





**సత్తుపల్లి, ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళా సాధికారతకు ఎంతో ఉపయోగకరంగా మారిందని ఆర్టీసీని బలోపేతం చేస్తూనే పథకం అమలు చేస్తోందనిసత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ లో రూ.10 వేల కోట్ల ప్రయాణ చార్జీల ఆదా అయిన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా 290 కోట్ల ఉచిత ప్రయాణాలు చేయడంతో ఈ చారిత్రాత్మక మైలురాయి సాధ్యమైందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా మణులందరికీ ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళల కోసం మహాలక్ష్మి పథకం ప్రారంభించామని, దీంట్లో భాగంగా ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించామని గుర్తు చేశారు. ఆర్టీసీని బలోపేతం చేయటానికి చర్యలు తీసుకుంటూనే, మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి ఉచిత ప్రయాణ మొత్తాన్ని ఎప్పటికప్పుడు ఆర్టీసీకి చెల్లిస్తున్నామని తెలిపారు. పేద మధ్యతరగతి కుటుంబాల మహిళలకు ఉచిత ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతోందని, బస్సు చార్జీలలో మిగిలిన మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకునే వెసులుబాటు కలిగిందన్నారు. మహిళా సాధికారతలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామన్నారు. తెలంగాణలో కోటి మంది మహిళల్ని కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేస్తోందనన్నారు. ఉచిత ప్రయాణంతో మహిళలకు డబ్బులు మిగులుతున్నాయన్నారు. ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చిన తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య అనూహ్యంగా పెరిగిందన్నారు. అనంతరం ఉచిత బస్సు పథకం తమకు ఏ విధంగా సహాయపడుతుందనే విషయాన్ని పలువురు మహిళా ప్రయాణికులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణికులతో కలిసి ఆమె భారీ కేక్ కట్ చేసి వివిధ రోడ్లలో సుదీర్ఘకాలంగా ప్రయాణిస్తున్న మహిళా మణులను ఆమె ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్పర్సన్ ఎండి రెహానా కమల్ పాషా, కౌన్సిలర్లు విరివాడ అపర్ణ, ఎండీ నసీమా షరీఫ్, ఉప్పు నాగమణి, మట్టా దేవమణి, నాయకులు గాదె చెన్నారావు,ఆర్టీసీ సత్తుపల్లి డిఎం గురిజాల లక్ష్మీనారాయణ, మెకానికల్ ఇంజనీర్ సిలివేరు సాహితీ, వెల్ఫేర్ కమిటీ సభ్యులు సైదిరెడ్డి, ఏడీసీలు, ప్రయాణీకులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఘనంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలు

- డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు



**ఖమ్మం, ప్రతినిధి ఏప్రిల్ 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** సాంఘిక సంక్షేమ మరియు దివ్యాంగుల సంక్షేమ శాఖ గౌరవ మంత్రివర్యులు శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలను ఖమ్మం నగరంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఎన్ఎస్పీ గెస్ట్ హౌస్‌లో మాదిగ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమానికి కుక్కల రామకృష్ణ (ఆర్కే) అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా దళితరత్న, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్డీ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దళితులు, బలహీన వర్గాలు మరియు దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న ప్రజానాయకుడని కొనియాడారు. సమాజ అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పగిడి ముక్కుల విజయ్ కుమార్, తూరిగంటి దశరథ్ టీచర్, దూభాషి శ్రీను (రైల్వే ఉద్యోగి), టీఎంహెచ్డీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడిశాల వెంకన్న మాదిగ, పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జంగం వెంకయ్య మాదిగ, ఖమ్మం నగర కన్వీనర్ జంగం నగేష్, గోపి సుందరయ్య జిల్లా గోపిరాజు తదితరులు పాల్గొన్నారు. వివిధ డివిజన్లకు చెందిన కుల పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హిందూ సమాజాన్ని ఏకం చేసే బృహత్తర ప్రయత్నమే" హిందూ సమ్మేళనం"

- **ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ జి..**





**కరీంనగర్,ఏప్రిల్01(పీసీబ్ల్యూ న్యూస్):** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్దిఉత్సవాల్లోభాగంగా హిందూ సమాజాన్ని ఏకం చేసే బృహత్తర ప్రయత్నం జరుగుతుందని, ఆ దిశలో దేశవ్యాప్తంగా " హిందూ సమ్మేళనం" కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ జి తెలిపారు. కరీంనగర్ లోని బృందావన్ గార్డెన్ లో హిందూ సమ్మేళనాల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా అనేక ప్రోగ్రాం లు విజయవంతంగా కొనసాగుతున్నాయని, ముఖ్యంగా విజయదశమి ఉత్సవం, పంచ పరివర్తన్ తో ప్రతి కుటుంబాన్ని కలిసే మహత్తర కార్యక్రమం సక్సెస్ ఫుల్ గా పూర్తయిందన్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా హిందూ సమ్మేళన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడానికి స్వయం సేవకులు తగిన కృషి చేయాలన్నారు. పట్టణ ప్రాంతాలు, బస్తీలు, గ్రామీణ ప్రాంతాలను కలుపుకొని హిందూ సమ్మేళనాలను నిర్వహించాలన్నారు. ప్రధానంగా, హిందూ సమ్మేళన నిర్వహణ కోసం ఖండ, ఉపఖండ వారీగా సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని నిర్వహణకమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమాజంలోని వివిధ వర్గాలను ఏక తాటిపై తీసుకువచ్చి, హిందువుల ఐక్యతను చాటి చెప్పే దిశలో హిందూ సమ్మేళనాలు ఉంటాయన్నారు. ఈ సమ్మేళనాల్లో సాధారణంగా ప్రముఖ మేధావులు, సామాజిక నాయకులు, స్వామీజీల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉండే విధంగా చూడాలని, హిందూ సమ్మేళనాలను విజయవంతం చేయడానికి తగిన కార్యాచరణతో ముందు కొనసాగాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో విభాగ్ కార్యవాహ పాక సత్యనారాయణ, జిల్లా సంఘచాలకులు దుర్శెట్టి నిరంజనా చారి, జిల్లా సహా సంఘచాలకులు ఎలగందుల సత్యనారాయణ, నగర సంఘచాలకులు హనుమాండ్ల శ్రీనివాస్ రెడ్డి, పలువురు స్వయం సేవకులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అభివృద్ధి: సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు





**తల్లాడ, ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్)** :ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అభివృద్ధి చేసి చూపిస్తానని తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలగా గ్రామంలో మంచినీటి ఎద్దడితో సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు ఇబ్బందిని తెలుసుకొని సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి) గ్రామంలోని నారాయణపురం, గొల్లగూడెం రోడ్ లోని బోరు,పైప్ లైన్లను మరమ్మతులు చేసి నూతన బోర్లను, పైపులను లైన్లను బిగించి ప్రజలకు మంచినీటి సరఫరాను నిరంతరంగా అందించను చర్యలు తీసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్న తమ దగ్గరకు వచ్చి నేరుగా చెప్పవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమశీలో గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విభజన హామీలు అమలు చేయాలి



**తెలంగాణకు న్యాయం చేయండి**

**లోక్‌సభలో కేంద్రాన్ని నిలదీసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి**

**బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి**

**ఖమ్మం, పాలమూరును పట్టించుకోండి**

**భద్రాచలం నుంచి ఆంధ్రా లో కలిసిన నాలుగు గ్రామపంచాయతీలను తిరిగి ఇచ్చేయండి**

**కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేసి, కేటీపీఎస్ విస్తరణ పై దృష్టి సారించాలని గళమెత్తిన రామసహాయం**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం2014 అమలుపై ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్‌సభలో బుధవారం గళమెత్తారు. విభజన సమయంలో తెలంగాణ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. సంస్థాగత, ఆర్థిక, మౌలిక రంగాలకు సంబంధించిన పలు కీలక అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. **హామీలు కాగితాలకే పరిమితం కావద్దు** విభజన చట్టంలో తెలంగాణ అభివృద్ధి కోసం అనేక హామీలు, కట్టుబాట్లు ఉన్నప్పటికీ, వాటి అమలు ఇంకా పూర్తికాలేదని రఘురాం రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హామీలు కాగితాలకే పరిమితం కాకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. **జాతీయ స్థాయి విద్యాసంస్థలు అవసరం :**తెలంగాణలో ఎన్ఐటి, ఐఐఎం, ఐఐఎస్ఇఆర్, సెంట్రల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే ఉన్న విద్యాసంస్థలను జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లాలని సూచించారు. **పారిశ్రామికాభివృద్ధి, ఐటీ విస్తరణ :**ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధికి కేంద్రం మద్దతు ఇవ్వాలని, హైదరాబాద్ ఇప్పటికే ఐటీ హబ్‌గా ఉన్నందున దాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. **ఖమ్మం జిల్లా ప్రస్తావన :**మహబూబ్‌నగర్, ఖమ్మం వంటి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి సెక్షన్ 94(2) కింద రావాల్సిన ఆర్థిక తోడ్పాటు ఇంకా పూర్తిగా అందలేదని పేర్కొన్నారు. ఈ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. **బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ఎప్పుడు..?**సెక్షన్ 93 ప్రకారం బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు హామీ ఇంకా నెరవేరలేదని పేర్కొంటూ దీనిపై స్పష్టత ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. **నీటి వనరులపై న్యాయం :** గోదావరి, కృష్ణా నదులు తెలంగాణలోనే అత్యధికంగా ప్రవహిస్తున్నందున, రెండు రాష్ట్రాల్లో కృష్ణా, గోదావరి నది యాజమాన్య బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని కోరారు. **కేటీపీఎస్ కు సంబంధించి.. :**కేటీపీఎస్ థర్మల్ పవర్ స్టేషన్‌కు అదనంగా 825 మెగావాట్ల సామర్థ్యాన్ని పునరుద్ధరించాలని సూచించారు. **మౌలిక సదుపాయాల అభివృద్ధి**రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) కోసం :అదనపు నిధులు కేటాయించాలని కోరారు. **కొత్తగూడెంకు ఎయిర్ పోర్ట్ కావాల్సిందే :** వరంగల్‌కు విమానాశ్రయం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, కొత్తగూడెం మరియు ఆదిలాబాద్/పెద్దపల్లి ప్రాంతాల్లో కూడా విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. **భద్రాచలం గ్రామాల సమస్యపై.. :**రెండో సవరణలో భద్రాచలం అసెంబ్లీ పరిధిలోని నాలుగు గ్రామ పంచాయతీలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆ గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని కేంద్రాన్ని కోరారు. **ఏపీ సోదర, సోదరీమణులారా.. : అది బ్లాక్ డే కాదు.. రెండు రాష్ట్రాల అభివృద్ధికి చక్కటి అవకాశం**

ఆంధ్రప్రదేశ్ సోదర సోదరీమణులరా.. అని పేర్కొని ప్రత్యేకంగా విన్నపం చేస్తూ... రాష్ట్ర విభజనను ఒక చీకటి రోజుగా చూడవద్దని సూచించారు. ఇది రెండు రాష్ట్రాల అభివృద్ధికి గొప్ప అవకాశమని పేర్కొన్నారు.

**సమాన న్యాయం చేయాలి :**

ఆంధ్రప్రదేశ్‌కు అదనపు నిధులు ఇవ్వడంపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే అదే విధంగా తెలంగాణ అభివృద్ధికి కూడా ఈ బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరారు. రెండు రాష్ట్రాలు సమానంగా అభివృద్ధి చెందేలా చూడాలని సూచిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# శ్రీ బోయకొండ గంగమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్



**ఏపీ అన్నమయ్య జిల్లా పుంగనూరు ఏప్రిల్ 1 (పి.సి. డబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** చౌడేపల్లి మండలం దిగుపల్లి గ్రామం వద్ద వెలసి ఉండు శ్రీ బోయకొండ గంగమ్మ అమ్మవారిని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్ దర్శించుకున్నారు. కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న శ్రీ బోయకొండ గంగమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆయన అన్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆలయ అధికారులు వీరికి దర్శన ఏర్పాట్లు కల్పించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి సిరి వేలు గంగాధర్ చిన్న రాయల్ జన్మదిన సందర్భంగా పసుపులేటి హరిప్రసాద్ జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కోలా సోమశేఖర్, విరుపాక్షి, జన సైనికులు పాల్గొన్నారు.

# ఖమ్మం జలవనరుల శాఖకు కొత్త దిశ

### సీఈగా అదనపు బాధ్యతలు స్వీకరించిన మంగళంపూడి

### వెంకటేశ్వరరావుకు ఘన స్వాగతం

### తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) అభినందనలు



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన మంగళంపూడి వెంకటేశ్వరరావుకి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) ఖమ్మం జిల్లా యూనిట్ ఘనంగా అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా ఆయనకు బుధవారం పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో జిల్లాలో జలవనరుల అభివృద్ధికి మరింత కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. టీజీవో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి మాట్లాడుతూ.. మంగళంపూడి వెంకటేశ్వరరావు అనుభవం, నైపుణ్యం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి దోహదపడుతుందని అన్నారు. రైతుల సంక్షేమం, నీటి వనరుల సమర్థ వినియోగం, కొత్త ప్రాజెక్టుల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళంపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, జిల్లాలో జలవనరుల అభివృద్ధి, ప్రజల అవసరాల తీర్చడంలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అందరూ కలిసి ఆయనకు అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం సానుకూల వాతావరణంలో సాగుతూ, సహోద్యోగుల మధ్య ఐక్యతను ప్రతిబింబించింది. ఈ కార్యక్రమంలో టీజీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేష ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి. విజయ్ కుమార్, కార్యవర్గ సభ్యులు మేకల గోపాలకృష్ణ, మోదుగు వెంకటేశ్వర్లు, బి. హరీష్, సతీష్, భాస్కర్, డాక్టర్ బూరుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి


### వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు తన్నీరు క్రిష్ణార్జునరావు





**కల్లూరు, ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ తీసుకు వచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి అని కల్లూరు లో సీఐటీయు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు తన్నీరు కృష్ణార్జునరావు మాట్లాడుతూ ఎంతోమంది కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రం లో వున్న బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో ఎలాంటి చర్చ లేకుండా కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకు రావడం దారుణమని అన్నారు. ఎనిమిది గంటల పనిదినాలు రద్దు చేసి కార్మికులకు పన్నెండు గంటల పని చేయించేందుకు పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి కార్మికులను యజమానుల వద్ద తమ హక్కులకోసం బిక్షం ఎత్తుకొనెలా కుట్రలు చేస్తున్నారని అన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు సంఘటితంగా పోరాటాలు చేయాలని తమహక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ రంగం కార్మికులు, మోర్తాల పిచ్చి రెడ్డి, షేక్ మహబూబ్, ఉప్పు నరసింహారావు, జానీ, ఖమ్మంపాటి బాలస్వామి, వేల్పుల రవి ఏసుబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

# అంతఃపురాణ కేసరి డాక్టర్ గండు హరికిషోర్

- ఆధ్యాత్మిక సాహిత్యంలో ఖమ్మం ఖ్యాతిని ప్రపంచానికి చాటిన యువ ప్రతిభ
- సంస్కృతంలో శివపురాణ రచనతో భక్తి మార్గంలో కొత్త వెలుగులు
- జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలతో మెరిసిన ఆధ్యాత్మిక కిశోరం







**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆధ్యాత్మికతను ఆచరణలోకి తెచ్చి, భక్తి భావజాలాన్ని యువతలో నాటుతున్న "అంతఃపురాణ కేసరి" డాక్టర్ గండు హరికిషోర్ గౌడ్ పై ప్రశంసల వర్షం కురుస్తోంది. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కె. సూర్య అప్పారావు ఇటీవల ఖమ్మంలో ఆయన నివాసాన్ని సందర్శించి, ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంస్కృత భాషలో శివపురాణాన్ని రచించి భక్తి మార్గాన్ని ప్రజల్లో విస్తరింపజేస్తున్న హరికిషోర్ గౌడ్ నిజంగా అభినందనీయులని కొనియాడారు. పుస్తక పఠనంలో అంతర్ముఖ భక్తి ప్రయాణాన్ని ఆవిష్కరించి, ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగించే అరుదైన ప్రతిభ ఆయనదని పేర్కొన్నారు. ఆధ్యాత్మికత అనేది భౌతిక ప్రపంచానికి అతీతంగా ఆత్మజ్ఞానం, దైవచింతన, యోగం, మోక్షసాధన వంటి విలువలను అందించే మార్గమని, అలాంటి భావజాలాన్ని సులభంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో హరికిషోర్ గౌడ్ కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన తెలిపారు. ఆస్ట్రాలజీ, న్యూమరాలజీ, పామిస్ట్, ఫేస్ రీడింగ్ రంగాల్లోనూ ఆయనకు ఉన్న విశేష అనుభవం ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తోందని అన్నారు. గత 35 ఏళ్లుగా లక్షలాది మందికి సేవలందిస్తూ, ఆధ్యాత్మిక, జ్యోతిష్య రంగాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన హరికిషోర్ గౌడ్ అనేక ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. వరల్డ్ బుక్ ఆఫ్ స్టార్ రికార్డ్, తెలంగాణ కీర్తి పురస్కార్, గద్దర్ అవార్డు, భారత్ ప్రతిభా సమ్మాన్ వంటి గౌరవాలు ఆయన ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. అంతేకాకుండా రైసింగ్ స్టార్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం విశేషం. ఖమ్మం నేలపై జన్మించి, ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ గండు హరికిషోర్ గౌడ్ యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆయన సేవలు మరింత విస్తరించి, భక్తి మార్గంలో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నారు.

# విద్యాశాఖ పనితీరుపై సబ్ కలెక్టర్ సమీక్ష

### పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు



**కల్లూరు, ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు డివిజన్‌కు చెందిన మండల విద్యా అధికారులతో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ విస్తృత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యాశాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించి, ప్రస్తుత పరిస్థితులను విశ్లేషించారు. ప్రధానంగా ఈసీఆర్ కార్యక్రమం పురోగతి, విద్యార్థుల ఎల్ఆర్బిడి వివరాలు, కుల ధృవపత్రాల జారీ పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించారు. పెండింగ్‌లో ఉన్న ధృవపత్రాల కేసులను ఆలస్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ తదితర ధృవపత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా సేవలు సమర్థవంతంగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమయపాలనతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే విద్యాశాఖలో నిర్వహణ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచాలని, ప్రతి పాఠశాలలో విద్యా ప్రమాణాలను పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరును సమీక్షించిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అన్ని అంశాలలో పురోగతి సాధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ ప్రాధాన్యతగా భావించాలని, అందుకు అనుగుణంగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత విద్యాశాఖ అధికారులు పాల్గొని, తమ తమ పరిధిలో జరుగుతున్న పనులపై వివరాలు సమర్పించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్ణయించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ పునరుద్ఘాటించారు.

# మామిండ్ల సురేష్ పుట్టినరోజు 'రక్తదాన యజ్ఞం'!

### 75 మంది యువకుల రక్తదానం.. ఆదర్శంగా నిలిచిన సేవా కార్యక్రమాలు.







**హనుమకొండ టౌన్, ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజ సేవలో యువత భాగస్వాములు కావడమే నిజమైన పుట్టినరోజు వేడుక అని పలువురు నాయకులు కొనియాడారు. గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ కార్పొరేటర్ రాజు సోదరుడు, కాంగ్రెస్ యువ నాయకులు మామిండ్ల సురేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తనయుడు కీర్తిశేషులు నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. న్యూ శాయంపేట సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సోదరుడు నాయిని అమరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టినరోజున కేకులు కట్ చేయడం, పార్టీలు చేసుకోవడం కంటే, ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం చేయడం ఎంతో గొప్ప విషయమని, ఇది సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ పిలుపుతో సురేష్ అభిమానులు, డివిజన్ యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి 75 మంది రక్తదానం చేశారు. **సేవా కార్యక్రమాలతో సందడి:** రక్తదాన శిబిరం అనంతరం మామిండ్ల సురేష్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మలికాంబ మనోవికాసం కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, సురేష్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆమరణదీక్ష చేసైనా ఇండ్ల స్థలాలు సాధిస్తాం

### టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి

### జర్నలిస్టుల సంక్షేమం కోసమే పెడరేషన్ పోరాటం

### అక్రిడిటేషన్‌లు, హెల్త్ కార్డులు, ఎడ్యుకేషన్ సమస్యలపై దశలవారి పోరాటం





**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధనే లక్ష్యంగా టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తుందని, ఆమరణ నిరాహారదీక్ష చేసైనా ఇండ్ల స్థలాలు సాధిస్తాం అని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్- హెచ్ 2843) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. దీనిలో భాగంగా ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల హామీని అమలు చేయాలని దశల వారి ఉద్యమంతో ప్రభుత్వాన్ని కదిలించాలని అప్పటికి వినకపోతే, ఆమరణ నిరాహార దీక్షకు సైతం సిద్ధమవుతోందని వెల్లడించారు. ఖమ్మంలోని మంచికంటి ఫంక్షన్ హాల్ లో బుధవారం ఏర్పాటు చేసిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఇండ్ల స్థలాల సాధన కోసం దశల వారీ పోరాటాలు చేపడుతామని తెలిపారు. తొలుత సంతకాల సేకరణతో కార్యక్రమాన్ని ప్రారంభించి వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతామని అన్నారు. ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు, మంత్రుల క్యాంపు కార్యాలయాలు, కలెక్టరేట్ ముట్టడి, అంతిమంగా ఆమరణ నిరాహార దీక్షలు చేపడుతామని వెల్లడించారు. అలాగే అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, స్కూల్, కళాశాలల ఫీజుల్లో రాయితీ... తదితరాంశాలపై కూడా సమావేశం చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న హెల్త్ కార్డులు అత్యవసర పరిస్థితుల్లో ఏరకంగానూ జర్నలిస్టులకు ఉపయోగపడటం లేదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు సైతం హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రిడిటేషన్ల విషయంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక కార్డులు ఇస్తున్నామని ప్రకటిస్తూనే... మరోవైపు నిబంధనల పేరుతో ప్రభుత్వం కొర్రీలు పెడుతోందని తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల కార్డులు ఉంటే వాటిని 44 వేలకు పెంచుతున్నట్లు ప్రకటిస్తూ... అర్హతలు, నిబంధనల పేరుతో కోత విధించే చర్యలు ఏమాత్రం సహించరానివని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం విషయంలో కొనసాగుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ కొనసాగే నిరసన కార్యక్రమాలు అన్నింటికీ జర్నలిస్టులు జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం ఇండ్ల స్థలాల కోసం ఇటీవల ఖమ్మం ప్రెస్ క్లబ్ లో 14 రోజుల పాటు రిలే నిరాహారదీక్ష చేసిన సంఘం సభ్యుడు కొరకొప్పుల రాంబాబును జిల్లా కమిటీ సన్మానించింది. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవి కిరణ్, టీడబ్ల్యూజేఎఫ్ స్టేట్ కౌన్సిల్ మెంబర్స్ బాలకృష్ణ, నలుబోల మధుశ్రీ, జిల్లా సహాయ కార్యదర్శులు కూరాకుల గోపి, జక్కంపూడి కృష్ణ, కెమెరామెన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గణేష్, ఖమ్మం నియోజకవర్గ అధ్యక్షులు తురగ మూర్తి, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దగ్గుబాటి మాధవరావు, నూకల రామచంద్రమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు షేక్ జానీ పాషా, కొత్త యాకేష్, మోహన్ రావు, బంకా వెంకటేశ్వర్లు, కె అచ్చిరెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా డాక్టర్ కాళీ ప్రసాద రావు



**హన్మకొండ ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన డాక్టర్ కాళీ ప్రసాదరావు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...నాపై పూర్తి నమ్మకం ఉంచి,భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎంపిక చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్. రామచంద్రరావు కు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. అలాగే నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి,బండి సంజయ్ కుమార్,మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు,హన్మకొండ జిల్లా ఇంచార్జి మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్,హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవి కేవలం ఒక అలంకారం మాత్రమే కాదని,భరతమాత సేవలో నాపై ఉన్న బాధ్యతను గుర్తు చేసే ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నాను అని తెలుపుతూ ఈ నియామకంలో నాకు అండగా నిలిచిన సీనియర్ నాయకులు మాజీ శాసనసభ్యులు మార్తినేని ధర్మారావు,టి. రాజేశ్వర్ రావు, ఒంటెరు జైపాల్,వన్నాల శ్రీరాములు,మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, డా. పెసరు విజయచంద్ర రెడ్డి,డా. సిరంగి సంతోష్,బిజెపి జాతీయ, రాష్ట్ర,జిల్లా నాయకత్వానికి, అలాగే పరకాల నియోజకవర్గం లోని నా కార్యకర్త సోదర,సోదరీ మనులందరికి పేరుపేరునా నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాడానికి,రాష్ట్ర నాయకత్వ మార్గదర్శకత్వంలో కార్యకర్తలను కలుపుకుంటూ పార్టీ బలోపేతానికి,రాబోయే ఎన్నికల్లో పరకాల గడ్డపై కాషాయ జెండాను రెపరెపలాడించేందుకు అహర్నిశలు శ్రమిస్తానని తెలుపుతూ ప్రోత్సహించిన పెద్దలందరికీ మరోసారి ధన్యవాదాలు తెలిపారు.

# శ్రీనగర్ గ్రామపంచాయతీ నూతన కార్యాలయం ప్రారంభించిన మంత్రి సీతక్క








**మల్లంపల్లి మండల ప్రతినిధి, మార్చి 01 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని శ్రీనగర్ గ్రామంలో అభివృద్ధి పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క బుధవారం శ్రీకారం చుట్టారు. శ్రీనగర్ గ్రామంలో మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.తో కలిసి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం మరియు ఉపాధి హామీ పథకం నిధులతో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మల్లంపల్లిని ప్రత్యేక మండలంగా ప్రకటించి ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకుందని తెలిపారు. మండల సముదాయ భవనాలు నిర్మిస్తూ ఎంపీడీఓ, ఎంఆర్ఓ కార్యాలయాలను ఒకే చోట ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలోని అంగడి స్థలాన్ని మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే మల్లంపల్లిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మహిళా సంఘ సభ్యులకు ఇందిరమ్మ జీవిత బీమా పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. అక్షరమాల కార్యక్రమం ద్వారా మహిళలు చదువుకో వడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.18 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సీఆర్ఆర్, ఎంఆర్ నిధులతో రోడ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అదనపు కలెక్టర్ సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, డీఆర్డీఓ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ సునీత, మండల ప్రత్యేక అధికారి కృపాకర్, శ్రీనగర్ సర్పంచ్ ఆకుల మల్లేష్, ఉప సర్పంచ్ గుగులోత్ అరుణ, వార్డ్ సభ్యులు, ఎంపీఓ, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళా సంఘాలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయడమే లక్ష్యం

**ఈనెల 15న పెద్దపల్లిలో అసెంబ్లీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్**

**యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు నరేష్**




**పెద్దపల్లి ఏప్రిల్ 01 (పిసిడబ్ల్యూన్యూస్) :** యువజన కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పెద్దపల్లి అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాల నరేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం బొంకూరి అవినాష్‌తోపాటు యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి అసెంబ్లీ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి త్వరలోనే గ్రామ, మండల, అసెంబ్లీ కమిటీలను వేయనున్నట్లు తెలిపారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావును కోరినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు యువతను వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు మత్తు వదలండి – మైదానంలోకి రండి అనే నినాదంతో ఈనెల 15న పెద్దపల్లి ప్రభుత్వ కళాశాల మైదానంలో అసెంబ్లీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలోని క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు గుమ్మడి ప్రసాద్, పిరంగి రాజు, అసెంబ్లీ ఉపాధ్యక్షులు ఎంచర్ల తిరుమలేశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆయుభ్, కార్యదర్శులు అభినయ్ గౌడ్, కొడపత్రి మధుకర్, పట్టణ అధ్యక్షులు కొలిపాక శ్రవణ్, మండల అధ్యక్షులు జడల రాజు, సిరిసెటి రాహుల్, ఒర్రె అజయ్ యాదవ్, దేవేందర్ రెడ్డి, నాయకులు అరగొండ రాజ్ కుమార్, వెలిశాల రాకేష్, రాకేష్ యాదవ్, గుర్రాల వాసు, స్వామి రాజ్ యాదవ్, అజయ్, పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలు

● సామాజిక న్యాయానికి అంకితమైన నాయకుడికి విశేష సన్మానం ● డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాదిగ సంఘాల ఐక్యోత్సాహం



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరంలోని ఎన్ఎస్పీ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలు ఉత్సాహభరితంగా, హృదయాన్ని హత్తుకునే వాతావరణంలో నిర్వహించబడ్డాయి. మాదిగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం బుధవారం కుక్కల రామకృష్ణ (ఆర్కే) అధ్యక్షతన జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన దళితరత్న, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్డీ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్, మంత్రి అడ్లూరి సేవలను కొనియాడుతూ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాల్గొన్న వారందరికీ స్వీట్లు పంచిపెట్టి ఆనందాన్ని పంచుకున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సామాజిక సంక్షేమం, దివ్యాంగుల అభ్యున్నతి కోసం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో మంత్రి ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తున్నారని, సామాజిక న్యాయం సాధనలో ఆయన కృషి మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు ఖమ్మం నగరంలో ఐక్యత, సేవాభావం, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పగిడి ముక్కుల విజయ్ కుమార్, తూరిగంటి దశరథ్ టీచర్, దూభాషి శ్రీను (రైల్వే ఉద్యోగి), టీఎంహెచ్డీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడిశాల వెంకన్న మాదిగ, పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జంగం వెంకయ్య మాదిగ, ఖమ్మం నగర కన్వీనర్ జంగం నగేష్, గోపి సుందరయ్య, గోపిరాజు, అలాగే నగరంలోని పలు డివిజన్ల కుల పెద్దలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వివిధ రకాల సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: చిట్యాల ఎస్.ఐ సతీష్



**చిట్యాల, ఏప్రిల్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త పంథాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, వీటి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చిట్యాల సబ్ ఇన్స్పెక్టర్ పోచంపల్లి సతీష్ హెచ్చరించారు. చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రం గ్రౌండ్ లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యంగా నేరాల గురించి వివరించారు: మీ పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి" లేదా "మీరు క్రైమ్ చేశారు" అని భయపెట్టి, వీడియో కాల్ ద్వారా మిమ్మల్ని గంటల తరబడి బంధించి (Digital Arrest), భయపెట్టి డబ్బులు వసూలు చేస్తారు. ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ ( తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని టెలిగ్రామ్ లేదా వాట్సాప్ గ్రూపుల ద్వారా ఆశ చూపిస్తారు. నకిలీ వెబ్‌సైట్లలో లాభాలు కనిపిస్తున్నట్టు నమ్మించి, భారీగా డబ్బులు కట్టించుకుని మోసం చేస్తారు. రిమోట్ యాక్సెస్ యాప్ ఫ్రాడ్ (Remote Access App Fraud): AnyDesk, TeamViewer వంటి యాప్‌లను ఇన్‌స్టాల్ చేయమని కోరితే ఎప్పుడూ చేయకండి. వీటి ద్వారా మీ ఫోన్ నియంత్రణను వారు తీసుకుని, మీ బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తారు. బ్యాంక్ / KYC అప్‌డేట్ ఫ్రాడ్ మీ బ్యాంక్ ఖాతా లేదా సిమ్ కార్డ్ క్లోజ్ అవుతుందని మెసేజ్‌లు పంపి, లింక్‌లు క్లిక్ చేయమని కోరుతారు. బ్యాంకులు ఎప్పుడూ ఫోన్ ద్వారా లేదా లింక్‌ల ద్వారా వ్యక్తిగత వివరాలు అడగవు. సిసిటివిల ఏర్పాటుకు లారీ యూనియన్ వితరణ నేరాల నియంత్రణలో సిసిటివిల పాత్రను గుర్తించి, చిట్యాల లారీ యూనియన్ వారు సామాజిక బాధ్యతగా రూ. 20,000/- (ఇరవై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని సీసీటీవీ టెక్నిషన్ కి అందజేశారు. ఈ మొత్తాన్ని పట్టణంలో ముఖ్య ప్రాంతాల్లో సిసిటివి కెమెరాల ఏర్పాటుకు వినియోగించనున్నట్లు ఎస్.ఐ తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా 1930 నంబర్‌కు కాల్ చేయాలి లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని కోరారు.

## శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో లక్ష్మీ యాగం



**చిట్వేలి మార్చి 01 (పీసీడబ్ల్యూ న్యూస్):** చిట్వేలి మండల కేంద్రంలోని పాత చిట్వేలి లో వెలసిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో బుధవారం శ్రీ మహాలక్ష్మీ యాగం నిర్వహించారు. ప్రతి సంవత్సరం 12 పౌర్ణమి పూజలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. పౌర్ణమి రోజు సందర్భంగా ఉదయం అమ్మవారికి, వీరభద్ర స్వామికి అభిషేకం అనంతరం గణపతి పూజ, కుంభారాధన నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుండి వచ్చిన వేద పండితులు మహాలక్ష్మి యాగం నిర్వహించారు. పూర్ణాహుతి తర్వాత వేద విన్నపం, వేద ఆశీర్వచనం నిర్వహించారు. వందలాది మంది భక్తులు హాజరయ్యారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. శ్రీ లక్ష్మీ యాగంలో పాల్గొన్న భక్తులకు దీర్ఘసౌమాంగళ్యం, పుత్ర,పౌత్రాభివృద్ధి, అష్టలక్ష్మి అనుగ్రహం, కుటుంబ శ్రేయస్సు లభిస్తుందని వేద పండితులు తెలియజేశారు.

## రామయ్య భక్తులకు అడుగడుగునా అన్నదానం ఏర్పాటు



**సిద్ధవటం మార్చి 01 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఒంటిమిట్ట కోదండరామయ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం జరిగే సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు వెళ్తున్న భక్తుల కోసం సిద్ధవటం మండలంలోని మాధవరం, ఉప్పరపల్లి గ్రామాల్లో ఘనంగా అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తుడు శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. గత 12 ఏళ్లుగా గ్రామ పెద్దలు, గ్రామస్తుల, దాతల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వామివారి కళ్యాణానికి తరలివెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిద్ధవటం మండలంలో ఉత్సాహంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



**సిద్ధవటం మార్చి 01 (పీసీడబ్ల్యూ న్యూస్):** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బుధవారం తెల్లవారుజాము నుంచే ఎన్టీఆర్ పింఛన్ భరోసా కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా మాధవరం-1 గ్రామంలో జరిగిన కార్యక్రమంలో స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు, యూనిట్ ఇన్చార్జి నాగూర్ బషీర్ భాష తదితరులు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా వికలాంగులకు రూ. 6,000, డయాలసిస్ రోగులకు రూ. 10,000, వితంతువులకు రూ. 4,000 పింఛన్ అందిస్తూ పేదల పక్షాన నిలుస్తోందని కొనియాడారు. రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు చంద్రబాబు, నారా లోకేష్ అహర్నిశలు కృషి చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ రామకృష్ణ, షేక్ ఖాదర్ బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తపల్లి పంచాయతీలో అభివృద్ధి పనులకు భూమి పూజ

**ప్రొద్దుటూరు మార్చి 01 (పీసీడబ్ల్యూ న్యూస్):** కొత్తపల్లె పంచాయితీ నందు 17 లక్షల నిధులతో త్రాగునీటీ పైప్ లైన్ పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి. నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లె పంచాయితీ ప్రకాష్ నగర్ (గణేష్ కాలనీ) నందు 17 లక్షలతో త్రాగునిటీ పైప్ లైన్ పనులను ప్రారంభించుటకు నేడు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి. కొత్తపల్లి పంచాయితీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి. వార్డుమెంబర్లు, ఇతర స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 10న వస్తున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ

తమిళ యువ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ సినిమాలో టాలీవుడ్ బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే సెన్సార్ పనులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్ అందుకున్న ఈ చిత్రం, అనేక వాయిదాల తర్వాత ఏప్రిల్ 10న తమిళంతో పాటు తెలుగులోనూ గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా తెలుగులో టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ విషయానికి వస్తే.. ఇది 2040వ సంవత్సరం నేపథ్యంలో సాగే ఒక ఆసక్తికరమైన ఫ్యూచరిస్టిక్ రొమాంటిక్ డ్రామాగా కనిపిస్తోంది. ప్రస్తుత కాలంలోని ఇన్‌స్టంట్ రిలేషన్ షిప్స్‌ను ఇష్టపడని హీరో(ప్రదీప్ రంగనాథన్) హీరోయిన్ (కృతి శెట్టి), పాతకాలం నాటి స్వచ్ఛమైన ప్రేమను కోరుకుంటారు. అయితే వీరి ప్రేమకథకు ఎస్. జే సూర్య ఎలా అడ్డుపడతాడు. ఎస్. జే సూర్య నడుపుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే సంస్థ ఉద్దేశ్యం ఏంటి అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇందులో ప్రేమ గురించే కాకుండా 2040లో ఏం మార్పులు రాబోతున్నాయి అనే చిన్న చిన్న విషయాలను కూడా చాలా చక్కగా చూపించారు మేకర్స్. యోగి బాబు, సీమన్, గౌరీ కిషన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నఈ చిత్రాన్ని లేడీ సూపర్ స్టార్ నయనతారతో కలిసి ఎస్.ఎస్. లలిత్ కుమార్ నిర్మించారు.






## విశ్రాంతి కోసం విదేశాలకు ప్రభాస్

టాలీవుడ్ డార్లింగ్, పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ వరుస షూటింగ్‌ల నుంచి చిన్న విరామం తీసుకున్నారు. ప్రభాస్ తన తదుపరి చిత్రాలపై మరింత జాగ్రత్తగా, పూర్తి ఫోకస్‌తో పని చేస్తున్నారు. ప్రస్తుతం చేతినిండా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న డార్లింగ్, కొద్ది రోజులు విశ్రాంతి అవ్వడానికి వెకేషన్‌కు రెడీ అయ్యారు. నిర్విరామంగా షూటింగ్స్‌లో పాల్గొంటున్న ఈ పాన్ ఇండియా స్టార్, వేసవి సెలవుల కోసం ఇటలీకి బయలుదేరారు. తాజాగా బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన ఇటలీకి పయనమయ్యారు. అక్కడ కొద్ది రోజులు ప్రశాంతంగా గడిపిన తర్వాత మళ్లీ హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. విరామం తర్వాత ఆయన నేరుగా సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో బాక్సాఫీస్‌ను షేక్ చేసే రేంజ్‌లో ఉన్న సినిమాలు ఉన్నాయి. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫౌజీ అందులో ఒకటి. ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా విడుదలయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్న చిత్రం స్పిరిట్. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కల్కి సీక్వెల్ షూటింగ్ ప్రారంభమైనప్పటికీ, ప్రభాస్ వెకేషన్ నుంచి రాగానే కీలక షెడ్యూల్స్ ప్రారంభం కానున్నాయని టాక్. బాక్సాఫీస్ వద్ద 'రాజా సాబ్' ఫలితం ప్రభాస్ అభిమానులను కొంత నిరాశపరిచినప్పటికీ, రాబోయే సినిమాల లైనప్ చూస్తుంటే డార్లింగ్ మళ్లీ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

## బిజీ షెడ్యూల్ వల్లనే డ్రాగన్‌లో నటించలేకపోయా

### మళయాళ నటుడు టొవినో థామస్ వెల్లడి



టాలీవుడ్ హీరో ఎన్టీఆర్- కన్నడ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ఓ పాత్ర కోసం మలయాళ నటుడు టొవినో థామస్‌ని చిత్ర బృందం ఎంపిక చేయనున్నట్లు ఇటీవల వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. వీటిపై టొవినో స్పందించారు. తన కొత్త సినిమా 'పళ్లిచట్టంబి' ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో క్లారిటీ ఇచ్చారు. మలయాళంలో వేరే సినిమాలు చేస్తుండటంతో.. డేట్స్ సర్దుబాటు కాక 'డ్రాగన్'లో నటించట్లేదని తెలిపారు. ' తెలుగు సినిమాల్లో నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. మలయాళంలో వర్కింగ్ కల్చర్ టాలీవుడ్‌కు భిన్నంగా ఉంటుంది. తక్కువ సమయంలోనే షూటింగ్ పూర్తి చేస్తాం. తెలుగు చిత్రాల షూటింగ్ షెడ్యూల్స్ ఎక్కువ ఉంటాయి. పైగా ఒకేసారి రెండు/మూడు చిత్రాల్లో నటించడం నాకు ఇష్టం ఉండదు. ఒక సినిమా పూర్తయ్యాకే మరో సినిమా చేస్తుంటా. ఒకవేళ నేను టాలీవుడ్‌లో ఓ పెద్ద సినిమాలో నటిస్తే.. నేను అంగీకరించిన మూడు/నాలుగు మలయాళ చిత్రాలపై ప్రభావం పడుతుంది. అందుకే తెలుగు సినిమాల్లో నటించలేకపోతున్నా' అని వివరించారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించిన 'పళ్లిచట్టంబి' ఏప్రిల్ 10న తెలుగులోనూ విడుదల కానుంది.

----------------

## తెలంగాణ నేపథ్య కథతో సుకుమార్ నిర్మాణంలో సినిమా



గత కొంతకాలంగా తెలుగు సినిమాల్లో తెలంగాణ నేపథ్య కథలను తరచుగా చూస్తున్నాం. తెలంగాణ మట్టికథలు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రధాన కథావస్తువుగా తీసుకుని దర్శకులు భావోద్వేగ కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. 'బలగం' ఈ కోవలోనే ఎలాంటి విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆ చిత్రాన్ని తెలంగాణలోని ప్రతి పల్లెలో తెరలు కట్టుకుని చూస్తూ ఎమోషనల్ అయ్యారు. 'బలగం' తరువాత తెలంగాణ నేపథ్య కథలతో సినిమాలు తెరకెక్కించడానికి దర్శక, నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. ఇక త్వరలో మరో తెలంగాణ నేపథ్య కథతో సినిమా సెట్స్ మీదకు వెళ్లడానికి సిద్ధంగా ఉంది. ప్రముఖ దర్శకుడు సుకుమార్ తన సొంత నిర్మాణ సంస్థ సుకుమార్ రైటింగ్స్ సంస్థపై చిత్రాలు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం సుకుమార్ రైటింగ్స్ సంస్థ నాగచైతన్య హీరోగా నటిస్తున్న వృషఖర్మ, రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రాలకు నిర్మాణ భాగస్వామిగా ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా సుకుమార్, నిర్మాత బన్నీవాస్‌లు సంయుక్తంగా ఓ చిత్రాన్ని నిర్మించడానికి ప్లాన్ చేస్తున్నారు. 'బలగం' ఫేమ్ ప్రియదర్శి హీరోగా నటించనున్న ఈ చిత్రం తెలంగాణ నేపథ్య కథతో రూపొందనుందని సమాచారం. ఈ చిత్రం ద్వారా ఓ నూతన దర్శకుడు పరిచయం కాబోతున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. దర్శకుడిగా స్టార్స్‌తో పాన్ ఇండియా చిత్రాలు తెరకెక్కిస్తున్న దర్శకుడు సుకుమార్, నిర్మాతగా కూడా ఇలాంటి కథలతో చిన్న సినిమాలు నిర్మించడం నిజంగా ప్రశంసనీయం.



## సక్సెస్ అయితేనే కృతిశెట్టికి కలిసొచ్చేది!

కృతి శెట్టి టాలీవుడ్ ..కోలీవుడ్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అందం, అభినయం, ట్యాలెంట్ ఉన్నా?టాలీవుడ్ లో అవకాశాలు అందుకోవడంలో విఫలమైంది. దీంతో కోలీవుడ్ లో కూడా అదృష్టాన్నిపరీక్షించుకుంది. అక్కడా అదే పరిస్థితి. కాకపోతే? తెలుగు కంటే తమిళ్ లో మెరుగ్గా కనిపిస్తోంది. సినిమా ప్లాప్ అయినా మరో ఛన్గ్స అందుకోగల్గుతుంది. అక్కడైనా ఇలా ఎంత కాలం? దీంతో అమ్మడి కెరీర్ హిట్ కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో కృతి శెట్టి ఆశలన్నీ తాజా చిత్రం -లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ- పైనే ఉన్నాయి. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకె క్కుతోన్న ఈ సినిమాపై కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ మంచి అంచనాలు ఉన్నాయి

ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం ఒక డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో మంచి బజ్ ఏర్పడింది. లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా గెస్ట్ రోల్ పోషించడం సినిమాకు కీలకంగా మారింది. ప్రత్యేకించి కృతి శెట్టికి తమిళంలో పెద్ద బ్రేక్ ఇచ్చే సినిమా అవుతుందని ఎంతో ధీమాతో ఉంది. ఈ విషయంలో మేకర్స్ కూడా అంతే కాన్ఫిడెంట్ గా ఉన్నారు. -లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ- సూపర్ హిట్ అయితే కృతి గ్రాఫ్ మళ్లీ ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. సినిమా గనుక ఆశించిన స్థాయిలో ఆడకపోతే? కృతి శెట్టి కెరీర్ మరిన్ని ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే కొత్త కథానాయికల నుంచి పోటీ పెరగడం, పాన్-ఇండియా సినిమాల ట్రెండ్ నడుస్తుండటంతో, పాత ఫామ్‌ను అందుకోవడం అమ్మడికి సవాలుగా మారింది. తమిళంలో విజయం సాధిస్తేనే తెలుగు మేకర్స్ ఆమె వైపు మళ్లీ చూసే పరిస్థితి కనిపిస్తోంది.

## నాకు వయసుతో పాటే బైకులపై ఆసక్తి పెరుగుతూ వచ్చింది: రాజశేఖర్



సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్, తన భార్య జీవిత గురించి ఓ సరదా విషయాన్ని మీడియా ముందు పంచుకున్నారు. తనకు ఎంతో ఇష్టమైన బైక్‌ను, తనకు తెలియకుండానే జీవిత అమ్మేశారని ఆయన నవ్వుతూ చెప్పారు. శర్వానంద్ హీరోగా నటిస్తున్న 'బైకర్' సినిమా ప్రచార కార్యక్రమంలో భాగంగా నిన్న హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఈ ఆసక్తికర సంఘటనను ఆయన వెల్లడించారు.

బైక్స్ అంటే తనకెంత ఇష్టమో వివరిస్తూ, చిన్నప్పటి నుంచి తనకు బైక్స్ అంటే చాలా ఇష్టమని, అమ్మమ్మగారింట్లో బుల్లెట్‌పై ఊరంతా తిరిగేవాడినని ఆయన గుర్తుచేసుకున్నారు. తనకు వయసుతో పాటు బైకులపై కూడా ఆసక్తి పెరుగుతూ వచ్చిందన్నారు. ఆ క్రమంలోనే శేషు సినిమా సమయంలో షూటింగ్ కోసం తాను స్వయంగా యమహా 650 బైక్‌ను కొనుగోలు చేశానని. ఆ తర్వాత కూడా దాన్నే కొన్నాళ్లు నడిపానని చెప్పారు. అయితే, నేను నడిపే విధానం చూసి జీవిత ఆందోళన చెందిందన్నారు. స్పీడ్‌గా డ్రైవ్ చేస్తున్నానని భయపడి తనకు తెలియకుండా జీవిత బైక్ అమ్మేసిందని నవ్వుతూ చెప్పారు.కాగా, ఏప్రిల్ 3న విడుదల కానున్న 'బైకర్' చిత్రంలో రాజశేఖర్ 'బుల్లెట్ సునీల్' అనే కీలక పాత్రలో నటిస్తున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ చిత్రంగా ఇది తెరకెక్కుతోంది. ఈ సినిమాతో పాటు, తాను 'మగాడు' అనే మరో చిత్రంలో నటిస్తున్నానని, అలాగే తన కుమార్తె శివానితో కలిసి ఓ సినిమాలో కనిపించనున్నట్లు రాజశేఖర్ తెలిపారు.